Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APTEL:2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 240 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :240 | బుధవారం 27 ఆగస్టు 2025 | వెల : 3 | పేజీలు : 4

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి సెల్ : 9440815774



## గవర్నర్ అధికారాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- ఆర్టికల్ 200 ప్రకారం బిల్లులను ఆపే అధికారం గవర్నర్‌కు ఉంటే.. మనీ బిల్లులను ఆపే అధికారం కూడా గవర్నర్‌కు ఉంటుంది
- బిల్లులకు గవర్నర్లు ఆమోదం ఇవ్వకుండా వీటో చేస్తే.. వారు మనీ బిల్లులను కూడా అడ్డుకోవచ్చు
- బిల్లుల ఆమోదం అంశంలో గవర్నర్లు, రాష్ట్రపతికి కాలపరిమితి విధించడంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ



## కొత్త చట్టం అధికారపార్టీకి చుట్టమైతే?

- ప్రత్యేకించి కేంద్రంలో పూర్తి మెజార్టీ లేని నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీహారు ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌లను కట్టడి చేయదానికి కూడా దీన్ని వాడవచ్చని కాంగ్రెస్ వ్యాఖ్యా
- బీజేపీయేతర పక్షాలు ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తప్పించి ప్రభుత్వాలను అస్థిర పరచదానికి ఇది ఒక ఆయుధం అవుతుందన్న సందేహాన్ని పలువురు వ్యక్తం
- ఈ బిల్లుపై టీడీపీ, జేడీ(యూ)లు కూడా మథన పడుతున్నట్లుగా కనిపిస్తుంది.

# ఖరీఫ్ రుణ లక్ష్యం రూ.1,80,540 కోట్లు




- జూన్ నాటికి ఇచ్చిన బ్యాంకులు ఇచ్చిన రుణం రూ.94,666 కోట్లు
- బ్యాంకర్ల సమావేశంలో సీఎం చంద్రబాబుకు చెప్పిన బ్యాంకర్లు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఖరీఫ్ సీజన్‌లో రూ.1,80,540 కోట్ల రుణ లక్ష్యానికిగానూ జూన్ నాటికి రూ.94,666 కోట్ల మేర రుణాలను ఇచ్చినట్లు సీఎం చంద్రబాబుకు బ్యాంకర్లు వెల్లడించాయి. మంగళవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులకు రూ.985 కోట్ల రుణాల్ని మంజూరు చేసిన బ్యాంకులు. ఎంఎస్‌ఎంఈ రంగానికి రూ.49,831 కోట్ల రుణం మంజూరు. విద్యారంగానికి రూ.252 కోట్లు, హౌసింగ్ కు రూ.1,146 కోట్ల రుణాలు మంజూరు చేసిన బ్యాంకులు. పునరుద్పాదక ఇంధన రంగానికి రూ.125 కోట్ల మేర రుణ మంజూరు చేసిన బ్యాంకర్లు. స్వయం సహాయ సంఘాలకు రూ.5,937 కోట్ల రుణాన్ని ఇచ్చిన బ్యాంకర్లు. ముద్రా రుణాల కింద రూ.3189 కోట్లు మంజూరు చేసిన బ్యాంకులు. వ్యవసాయం, ప్రాథమిక రంగాలు, ఎంఎస్‌ఎంఈ, ఎస్ హెచ్ జీ రంగాలకు రుణ వితరణ లక్ష్యాలు, గ్రామీణ ప్రాంతాల్లో - మిగతా3లో



పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు

వినాయక చవితి శుభాకాంక్షలు

నేడు వినాయక చవితి సందర్భంగా పత్రిక కార్యాలయానికి సెలవు. కావున రేపు (గురువారం) పత్రిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం.



## బీహార్ ఎన్నికలకు ముందే కొత్త అధ్యక్షుడి ఎంపికకు బీజేపీ సన్నాహాలు

- బీహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీ ప్రకటనకు ముందే నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవాలని యోచిస్తోంది
- త్వరలో అధికారికంగా ఈ నిర్ణయం వెలువడే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు
- ఈసారి పార్టీ జాతీయ అధ్యక్ష పదవిని మహిళలకు ఇచ్చే అవకాశం ఉందంటూ ఇటీవల వార్తలు
- అందులో ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఏపీ బీజేపీ ఎంపీ పురందేశ్వరీతోపాటు పలువురి పేర్లు

# బార్ అండ్ రెస్టారెంట్లకు టెండర్ల గడువు పొడిగింపు



- టెండర్ల డెడ్‌లైన్‌ను ఈ నెల 29 సాయంత్రం 6 గంటల వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటన
- ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాల పై మద్యం వ్యాపారులు ఆసక్తిగా లేరు
- దీంతో టెండర్ల గడువు సమీపిస్తున్నా వారి నుంచి ఆసక్తి కనిపించటం లేదు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బార్ అండ్ రెస్టారెంట్లకు టెండర్ల గడువును పొడిగింది. టెండర్ల డెడ్‌లైన్‌ను ఈ నెల 29 సాయంత్రం 6 గంటల వరకు పొడిగిస్తున్నట్టు ఓ ప్రకటనలో తెలిపింది ప్రభుత్వం రాష్ట్రంలోని 840 బార్లకు కొత్త పాలసీని రూపొందించింది. ఈ పాలసీ మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాల పై మద్యం వ్యాపారులు ఆసక్తిగా లేరు. దీంతో టెండర్ల గడువు సమీపిస్తున్నా వారి నుంచి ఆసక్తి కనిపించటం లేదు నిజానికి మంగళవారం సాయంత్రంతో దరఖాస్తు గడువు ముగిసింది. అయితే ఇప్పటివరకు 43 బార్లకు మాత్రమే 4 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు వచ్చిన మొత్తం 437 దరఖాస్తుల్లో 43 షాపులకు 4 చొప్పున 132 దరఖాస్తులు వచ్చాయి. మిగతా వాటికోసం కేవలం సింగిల్, డబుల్ అప్లికేషన్లు మాత్రమే రావడంతో ఎక్సైజ్ అధికారులు ఖంగుతిన్నారు బార్ అండ్ రెస్టారెంట్ పాలసీలోనే లోపాలు ఉన్నాయని, దరఖాస్తులు చేయకూడదని వ్యాపారులు నిర్ణయించుకున్నారు. - మిగతా3లో



## వరద ఉగ్రరూపం.. కొట్టుకుపోయిన హైవే

- హిమాచల్ ప్రదేశ్‌లో తీవ్ర స్థాయి వర్షాలు విరిగిపడ్డ కొండచరియలు
- భారీ వరదల వల్ల దెబ్బతిన్న కిరాట్పూర్-మనాలీ జాతీయ హైవే
- మండీ, మనాలీ లో పూర్తిగా స్తంభించిపోయిన ట్రాఫిక్

# ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదు



- రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్
- ఈ నౌకలను డిజైన్, స్టెల్త్, ఆయుధాలు, సెన్సార్ వ్యవస్థల్లో అత్యాధునిక సాంకేతికతో తయారు చేశారు
- దేశంలోని వేర్వేరు షిప్‌యార్డులలో నిర్మించిన రెండు ఫ్రంట్‌లైన్ సర్ఫేస్ యుద్ధ నౌకలను ఒకేసారి జాతికి అంకితం చేయడం ఇదే ప్రథమం.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం**

ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియ లేదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కొత్తగా తయారు చేసిన యుద్ధ నౌకలు 'ఉదయగిరి (ఎఫ్35)', - మిగతా3లో




## బిహార్ 'ఓట్ల చోరీ' విమర్శలు.. ప్రజాభిప్రాయం కోరనున్న ఈసీ

- ప్రజల ఓట్లను దొంగిలించే ప్రయత్నాలు చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపణలు
- ఓటర్ల జాబితా సవరణపై ప్రజలు ఏమనుకుంటున్నారనే విషయాన్ని స్వయంగా తెలుసుకోవడానికి ఎన్నికల కమిషన్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడి

## ఐదేళ్లలో జగన్ ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేదు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి:**



డీఎస్సీ విజయవంతంపై ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హర్షం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుతోనే విద్యా వ్యవస్థలో సమూల మార్పులు సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని కొల్లు స్పష్టంచేశారు. "ఐదేళ్లలో జగన్ ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వకుండా మోసం చేశారు. కూటమి తొలి సంతకం మెగా డీఎస్సీపై పెట్టి యువతకు అండగా నిలిచింది. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీలన్నీ పక్కాగా అమలు చేశాం. నమ్మి ఓట్లు వేసిన యువతకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుంది.

# రాయలసీమలో వజ్రాల వేట





**కర్నూలు :** రాయలసీమ ప్రాంతంలో కురిసిన వర్షాలు కర్నూలు, అనంతపురం జిల్లాల ప్రజల అదృష్టాన్ని పరీక్షించే సమయంగా మారాయి! ఖరీఫ్ సాగుతో పాటు ఇక్కడ వజ్రాల వేట కూడా జోరుగా సాగుతోంది. జొన్నగిరి, తుగ్గలి, పెరవలి మండలాల్లో వజ్రాలు దొరుకుతాయనే ప్రచారం ఎప్పటినుంచో ఉంది. ఈ వర్షాలకు భూమి తడిసి, విలువైన రాళ్లు పైకి తేలుతాయన్న మాటలతో.. స్థానికులు, వ్యాపారులు, ఇతర ప్రాంతాల నుంచి వజ్రాల వేటకు వస్తున్నారు."ఒక్క రాయి దొరికినా మీ అదృష్టమే మారిపోతుంది" అని మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన వ్యాపారవేత్త భరత్ పలోడ్ అన్నారు. సాధారణ రైతులు కూడా కోటీశ్వరులైన కథలు ఈ ప్రాంతంలో ఎంతో మందికి స్ఫూర్తినిచ్చాయని ఆయన తెలిపారు. పలోడ్ స్వయంగా 2018లో తొలి వజ్రాన్ని కనుగొన్నారు. ఈ ఏడాది మరొక వజ్రాన్ని రూ. 8 లక్షలకు అమ్ముకున్నానని చెప్పారు.సామాజిక కార్యకర్త దీపికా దుసకంటి గతంలో రూ. 5 లక్షల విలువైన వజ్రాన్ని అమ్మి, ఆ డబ్బుతో పేద పిల్లల చదువుకు సాయం చేసినట్లు గుర్తు చేసుకున్నారు."ఈసారి రూ. 10 లక్షల విలువైన వజ్రం దొరికింది. దీన్ని కూడా విద్యార్థుల కోసమే ఉపయోగిస్తాను," అని ఆమె తెలిపారు.వజ్రాలు దొరుకుతున్న వీడియోలు చూసి జొన్నలగిరికి వచ్చానని చిత్తూరుకు చెందిన రైతు గోదావరమ్మ చెప్పారు. "నేను ఆలస్యంగా వచ్చినా, వెతుకులాట కొనసాగిస్తాను. ఒక్కటి దొరికినా మా కుటుంబానికి సాయం అవుతుంది," అని ఆమె అన్నారు.కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ.. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో వజ్రాల గురించి అనేక కథలు ఉన్నాయన్నారు. "ప్రజలు పని కోసం వలస వెళ్లి, వర్షాకాలంలో తిరిగి వచ్చి వజ్రాల వేటలో పాల్గొంటారు. ఇంత పెద్ద మొత్తంలో వజ్రాల వేట సాగుతున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి నేరాలు నమోదు కాలేదు," అని ఆయన తెలిపారు. భూమిని తమదని చెప్పుకుని బయటివారిని అడ్డుకున్న సందర్భాలు ఉన్నప్పటికీ, పెద్దగా గొడవలు లేదా నేరాలకు సంబంధించిన సంఘటనలు జరగలేదని ప్రవీణ్ పేర్కొన్నారు.ఈ సీజన్‌లో చాలా విలువైన వజ్రాలు దొరికినట్లు వార్తలు రావడంతో మరింత ఉత్సాహం పెరిగింది. పెరవలి గ్రామానికి చెందిన వెంకటేశ్వర రెడ్డి అనే కూలీకి దొరికిన వజ్రాన్ని స్థానిక వ్యాపారికి రూ. 15 లక్షలకు అమ్ముకున్నాడని సమాచారం. అనంతపురం జిల్లాలో 40 ఎకరాలకు పైగా భూమి ఉన్న పీ బజరంగలాల్, తన భూమిలో వజ్రాల వేటకు అభ్యంతరం లేదని చెప్పారు. చాలామందికి ఇక్కడ వజ్రాలు దొరికాయని, వారికి తాగునీరు, ఆహారం కూడా అందిస్తున్నట్లు తెలిపారు. "ఈ వజ్రాలు ఇతరుల జీవితాల్లో సంతోషం తెస్తే, నేను పూర్తిగా మద్దతు ఇస్తాను," అని ఆయన అన్నారు.కర్నూలు జిల్లా మద్దికేర మండలానికి చెందిన శ్రీనివాసులు అనే రైతుకు రూ. 2 కోట్లు విలువ చేసే అరుదైన వజ్రం దొరికినట్లు, అది సిండికేట్‌కు చెందిన వ్యాపారులకు అమ్ముకున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ ఏడాది దొరికిన వజ్రాల్లో ఇదే అత్యంత విలువైనదని అధికారులు తెలిపారు. తుగ్గలి మండలం చింతలకొండ గ్రామంలో ప్రసన్న అనే మహిళ తన పొలంలో దున్నుతుండగా మెరిసే రాయి దొరికింది. దానిని స్థానిక వ్యాపారికి రూ. 13.5 లక్షలకు అమ్మింది. ఈ విషయం ఆమె కుటుంబానికే కాకుండా గ్రామంలోని అందరికీ ఆనందాన్ని ఇచ్చిందని గ్రామస్తులు తెలిపారు.జొన్నగిరి, పాగిదిరాయి, ఎర్రగుడి, ఉప్పర్లపల్లి వంటి ప్రాంతాల్లో వజ్రాల వేట వర్షాకాలంలో ఎక్కువగా ఉంటుంది. భారీ వర్షాల కారణంగా భూమిలోపల ఉన్న రాళ్లు బయటపడతాయని అంటూ ఉంటారు. అయితే చాలామంది ఖాళీ చేతులతోనే తిరిగి వెళ్తారు. అయినా అప్పుడప్పుడు దొరికే వజ్రాలు వేలాది మందికి స్ఫూర్తిని ఇస్తుంటాయి.కొన్ని సిండికేట్‌లు వజ్రం నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేసి, తక్కువ ధరకు కొనేందుకు ప్రయత్నిస్తాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిని ఎదుర్కోవడానికి కొంతమంది స్థానికులు ఆన్‌లైన్ వేలం లేదా సోషల్ మీడియాలో తమ వజ్రాలను యాడ్స్? రూపంలో పెట్టి మెరుగైన ధరలను పొందుతున్నారు. ఈ వ్యాపారంపై ప్రభుత్వం ఎలాంటి నిబంధనలను రూపొందించలేదు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఉన్నప్పుడు వజ్రాలకు ఎందుకు ఉండకూడదని పలువురు వంటి రైతులు ప్రశ్నిస్తున్నారు.ఈ వజ్రాల వేట శతాబ్దాల చరిత్రను కలిగి ఉంది. విజయనగర రాజుల ఖజానాలోకి రాయలసీమలో దొరికిన వజ్రాలు వెళ్లాయని జానపద కథలు చెబుతున్నాయి. ఈ వజ్రాల వేట కేవలం డబ్బు సంపాదించడం మాత్రమే కాకుండా, ఈ ప్రాంత ప్రజల జీవన శైలిలో ఒక భాగం అయింది. వలస వెళ్లిన కుటుంబాలు.. వర్షం పడగానే తిరిగి వచ్చి అదృష్టాన్ని పరీక్షించుకుంటాయి. అధికారులు దీనిని ఒక రకమైన "వజ్రాల వ్యవసాయం" అని పిలుస్తున్నారు. కఠినమైన భూభాగంలో, అదృష్టం, విశ్వాసం, పట్టుదలపై ఆధారపడిన ఈ వజ్రాల వేట, ఈ ప్రాంతంలో ఒక ప్రత్యేకమైన సాంప్రదాయంగా కొనసాగుతోంది.

# పీ4 కిందకు 13 లక్షల కుటుంబాలు

**విజయవాడ :** ఈ ఏడాది ఉగాది నాడు పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించగా..అప్పటి నుంచి బంగారు కుటుంబాలు, మార్గదర్శుల ఎంపిక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 13,40,697 బంగారు కుటుంబాలను 1,41,977 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు.. రాష్ట్ర వ్యాప్తంగా 1.69 కోట్ల కుటుంబాలు ఉన్నాయి.. సాయం కోరే పేద కుటుంబాలు 21 లక్షలు ఉన్నాయి. మార్గదర్శుల ఎంపికలో ఎలాంటి బలవంతం లేకుండా.. పూర్తి స్వచ్ఛంధంగానే ఈ కార్యక్రమాన్ని చేపడతున్నాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు."నేను కూడా మార్గదర్శినే. కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. సీఎంగా, పార్టీ అధ్యక్షుడిగా ఎంత బిజీగా ఉన్నా... దత్తత తీసుకున్న కుటుంబాలకు సమయం కేటాయిస్తా. మార్గదర్శులు ఇచ్చే చేయూతను బంగారు కుటుంబాలు అందిపుచ్చుకోవాలి.. అభివృద్ధి చెందాలి.. సద్వినియోగం చేసుకోవాలి. అలాగే సమాజం ఇచ్చిన సహకారంతో ఎదిగిన వారు సమాజానికి తిరిగివ్వాలని మార్గదర్శులు కూడా ఆలోచించాలి. మార్గదర్శులు డబ్బులిచ్చి సాయం చేయడంతో సరిపెట్టకుండా... బంగారు కుటుంబాలకు భరోసాగా ఉండాలి" అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను అనుకున్నదే చేస్తారు. దానిపై ఎన్ని విమర్శలు వచ్చినా వెనక్కు తగ్గరు. తనకు అనుకూలమైన మీడియా వ్యతిరేకించినా తాను మాత్రం అనుకున్న దారిలోనే ముందుకు వెళతారు. అందులో పీ4 పథకం పై ఆయన ముందుకు వెళ్లడానికే నిర్ణయించుకున్నారు. ఎవరేమనుకున్నా.. ఎవరేం చెప్పినా తన ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయన్న నమ్మకంతో చంద్రబాబు ఉన్నారు. పేదరిక నిర్మూలన అంటే మొత్తం పేదరికం రూపుమాపడం కాదని, కనీసం వాళ్లు తమ కుటుంబాన్ని పోషించుకునే స్థోమతను కల్పించడమే తన ఉద్దేశ్యమని చెప్పకనే చెప్పుకొచ్చారు. ఇందుకోసం వెనక్కు తగ్గబోమని, పేదవాళ్ల కోసం మనసున్న వాళ్లు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పదే పదే పిలుపు నిస్తున్నారు. గత ఉగాదికి పీ4 పథకాన్ని చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి పేదల కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకులను కూడా ఎంపిక చేసుకుంటూ వెళుతున్నారు. తాను నియోజకవర్గాలను పర్యటించినప్పుడు కనీసం రెండు, మూడు బంగారు కుటుంబాలను గుర్తించే పనిగా పెట్టుకున్నారు చంద్రబాబు నాయుడు. ఇప్పటికే ఈ పథకం కింద దాదాపు పదమూడు లక్షల మంది బంగారు కుటుంబాలను ఎంపిక చేశారు. అలాగే మార్గదర్శకులుగా ఉండేందుకు దాదాపు 1.40 లక్షల మంది ముందుకు రావడం కూడా పథకం విజయవంతమవుతుందన్న నమ్మకంతో ఉన్నారు. వీరిలో ప్రవాసాంధ్రులతో పాటు పారిశ్రామికవేత్తలు కూడా ఉన్నారు. సంపద సృష్టించడమంటే పేదల ఇళ్లల్లో వెలుగు నింపడమేనని చంద్రబాబు బలంగా విశ్వసిస్తున్నారు. ఈ పథకం వల్ల కొన్ని కుటుంబాలయినా కూడు, గుడ్డ, నివాసానికి ఇబ్బంది లేకుండా ఉండగలిగితే సగం విజయం సాధించినట్లేనని నమ్ముతున్నారు. ఎంతమందికి అవకాశాలు కల్పించామన్నది కాకుండా వారు జీవితంలో ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశాలు కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. దీనివల్ల పేదల కుటుంబాల్లో తొలుత మానసికంగా ధైర్యంవస్తుందని, తర్వాత వారు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవడమే కాకుండా పది మందికి ఉపయోగపడేలా తయారవుతారన్నది చంద్రబాబు ఆలోచన. ఈ మేరకు తన సొంత మీడియాలో విమర్శలు వచ్చినా లెక్క చేయడం లేదు. పీ4 పథకం ఖచ్చితంగా సక్సెస్ అవుతుందని ఆయన బలంగా విశ్విస్తున్నారు. మరి ఈ పథకం సక్సెస్ అయితే మాత్రం చంద్రబాబు నాలుగో పర్యాయంలో నూతన పథకంతో జనంలోకి వెళ్లినట్లే అనుకోవాల్సి ఉంటుంది. ఆరోగ్యం కోసం బెస్ట్ విధానం తీసుకురాబోతున్నాం. బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ప్రజారోగ్య పరిరక్షణ చేపడతాం. సంజీవని పేరుతో ప్రజారోగ్య పరిరరక్షణ కార్యక్రమాన్ని చేపట్టనున్నాం. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సంజీవని తెస్తున్నాం. ఇప్పటికే కుప్పంలో బిల్‌గేట్స్ ఫౌండేషనుతో డీజీ నెర్వ్ సెంటర్ ఏర్పాటు చేశాం. త్వరలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తాం. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తెస్తాం" అని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

**పీ4 అంటే??**

రాష్ట్రంలోని పేద కుటుంబాలను గుర్తించి సాధికారతను కల్పించటమే పీ-4 ప్రోగ్రాం ఉద్దేశ్యం. సంపద అధికంగా ఉన్న ఫ్యామిలీలను మార్గదర్శులుగా ఉంటారు. వీరు అట్టడుగున ఉన్న ఫ్యామిలీలకు సపోర్టుగా నిలబడే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా గ్రామా, వార్డుల్లో నిర్వహించే సర్వే, గ్రామసభల ఆధారంగా ఎంపిక చేస్తున్నారు.

# యూరియా సరఫరాపై విజిలెన్స్ నిఘా




**విజయవాడ :** ఏపీలో పలుచోట్ల యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇదే విషయంపై రాష్ట్ర వ్యవసాయశాఖ ఫోకస్ పెట్టింది. యూరియా కొరత రానివ్వకుండా చర్యలు చేపట్టామని వెల్లడించింది. విజిలెన్స్ నిఘా ఏర్పాటు చేశామని? జిల్లాల వారీ మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపింది.తెలుగు రాష్ట్రాల్లో యూరియా సరఫరా విషయంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇరు ప్రభుత్వాలు కూడా యూరియా సరఫరా విషయంలో ఎప్పటికప్పుడు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నాయి. యూరియా కొరత లేకుండా తక్షణమే సరఫరా చేయాలని కోరుతున్నాయి.యూరియా సరఫరా విషయంలో రైతులెవరూ ఆందోళన చెందొద్దని వ్యవసాయ శాఖ తెలిపింది. అవసరానికి మించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. గత ఖరీఫ్ సీజన్ కంటే ప్రస్తుత ఖరీఫ్ సీజన్లోనే ఎరువులను ఎక్కువగా సరఫరా చేశామని పేర్కొంది. రైతుల ఎరువుల అవసరాలను తీర్చేందుకు... సమయానికి, సమృద్ధిగా ఎరువులు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ పని చేస్తోందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది.

క్షేత్రస్థాయిలో యూరియా, ఎరువుల కొరత లేకుండా ఉండేలా విజిలెన్స్ నిఘా పెట్టింది.

2025 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగింది.

గత ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 8,76,928 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా, ఈ సంవత్సరం అదే కాలానికి 10,96,239 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగమయ్యాయి. గత సంవత్సరం కంటే 2,19,311 మెట్రిక్ టన్నులు అధికంగా ఎరువులను రైతులు కొనుగోలు చేశారు. యూరియా వినియోగం 2024లో 3,74,290 మెట్రిక్ టన్నుల నుంచి ఈసారి 4,57,727 మెట్రిక్ టన్నులకు పెరిగింది. ఇది 83,436 మెట్రిక్ టన్నుల అధిక వినియోగాన్ని సూచిస్తోందని వ్యవసాయ శాఖ వెల్లడించింది.డీఏపీ వినియోగం 1,17,582 మెట్రిక్ టన్నుల నుంచి 1,37,884 మెట్రిక్ టన్నులకు పెరిగింది. పొటాష్ వినియోగం 39,054 మెట్రిక్ టన్నుల నుంచి 54,276 మెట్రిక్ టన్నులకు పెరిగి 15,222 మెట్రిక్ టన్నుల మేర పెరిగింది. యూరియా, ఎరువుల కొరత రాకుండా నెలవారీ సరఫరా ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ తాజాగా వెల్లడించింది. కొందరు రైతులు అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేస్తున్నారని? దీని వల్ల ఇబ్బందులు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.రైతులకు మరింత భరోసా కల్పించేలా మార్క్ ఫెడ్ కు ఎరువుల కేటాయింపులను పెంచుతున్నామని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. అందుబాటులో ఉన్న ఎరువుల్లో ఇకపై 70 శాతం ఎరువులను మార్క్ ఫెడ్ కు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బ్లాక్ మార్కెట్టుకు తరలించిన వారిపై కేసులు పెట్టాలని.. ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు.

## ఖరీఫ్ రుణ లక్ష్యం రూ.1,80,540 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

బ్యాంకింగ్ సేవలపై సమీక్ష. వన్ ఫ్యామిలీ- వన్ ఎంట్రపెన్యూర్ కార్యక్రమం, 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు అంశంలో బ్యాంకుల సహకారంపై చర్చ. ఎస్ఎల్ బీసీ సమావేశాలు రైతులు, ప్రజలు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు ఉండాలి. రోటీన్ సమావేశాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు, ఇండికేటర్లు కూడా రోటీన్ గా మారుతున్నాయి. ఖరీఫ్ లో ఇప్పటికే సగం సమయం గడిచిపోయింది. ఈ పాటికే రైతులకు రుణాలు, ఇన్ పుట్ ఇవ్వాల్సి ఉంది. సీజన్ ఆఖరులో రుణాలు ఇవ్వటం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకర్లూ తమ తీరు మార్చుకోవాల్సి ఉంది. జీఎస్టీలో సంస్కరణల్ని కేంద్రం తీసుకువచ్చింది. నెక్ట్స్ జనరేషన్ సంస్కరణలు వచ్చేస్తున్నాయి. బ్యాంకులు, పబ్లిక్ పాలసీలు ఎప్పుడూ ప్రజల్ని నియంత్రించకూడదు. తదుపరి సంస్కరణల దిశగా ప్రోత్సహించాలి. అమెరికా, చైనా లాంటి దేశాలకు సవాలు విసిరేలా మన ఆర్థిక వ్యవస్థ తయారు అవుతోంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలి. 2047 నాటికి బలమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుంది. ఫాల్స్ లెండింగ్ చేయాలని ఎవరూ సిఫార్సు చేయరు, ఉత్పాదకత లేని రుణాలు కూడా మంచివి కావు. పేదలు- ధనికుల మధ్య అంతరాలు తగ్గేందుకు అవసరమైన చర్యలనూ చేపట్టాలి. ఆర్థికశాస్త్రం చదివిన విద్యార్థిగా, ప్రజాప్రతినిధిగా పేదల గురించి నేను ఆలోచన చేస్తున్నాను. ఓ దశలో సంపద సృష్టి కోసం పరిశ్రమల కోసం దావోస్ లాంటి ప్రాంతాల్లో విస్తృతంగా తిరిగాను అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## బార్ అండ్ రెస్టారెంట్లకు టెండర్ల గడువు పొడిగింపు..

-మొదటిపేజీ తరువాయి

డెడ్‌లైన్ ముగుస్తున్నా దరఖాస్తులు రాకపోవడంతో తుది గడువును ప్రభుత్వం 29 వరకు పెంచింది. అయినా సరే అప్లికేషన్లు పెట్టబోమని మద్యం వ్యాపారులు చెబుతున్నారు. పాలసీలో మార్పులు చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఆచరణ సాధ్యం కాని పాలసీని తీసుకొచ్చారని వ్యాపారుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

-మొదటిపేజీ తరువాయి

'హిమగిరి(ఎఫ్34)'లను విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ జాతికి అంకితం చేశారు. ఈ నౌకలను డిజైన్, స్టెల్త్, ఆయుధాలు, సెన్సార్ వ్యవస్థల్లో అత్యాధునిక సాంకేతికతో తయారు చేశారు. దేశంలోని వేర్వేరు షిప్‌యార్డులలో నిర్మించిన రెండు ఫ్రంట్‌లైన్ సర్ఫేస్ యుద్ధ నౌకలను ఒకేసారి జాతికి అంకితం చేయడం ఇదే ప్రథమం. బ్లూ వాటర్ పరిస్థితుల్లో రక్షణ బాధ్యతలను నిర్వర్తించే సామర్థ్యం ఈ నౌకల సొంతం. ఈ రెండు నౌకలు బహుళ పాత్రలు పోషించనున్నాయని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. "స్వదేశీ యుద్ధనౌక సామర్థ్యానికి ఈ నౌకలు ప్రతీక. ఆత్మనిర్భర్ భారత్‌కి ఇవి నిదర్శనం. సాంకేతిక పరిజ్ఞానం ఈనౌకల తయారీలో ప్రతిబింబిస్తోంది. 2050 నాటికి 200 యుద్ధనౌకలు నిర్మాణం చేస్తాం" అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

# క్షేత్రస్థాయి పటిష్టతపై జనసేన దృష్టి



**విశాఖపట్టణం :** జనసేన పార్టీ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సిద్ధమవుతుంది. అందుకే విశాఖలో మూడు రోజులపాటు విస్తృత స్థాయిసమావేశం నిర్వహిస్తున్నారు.ఆగస్ట్ 28వ తేదీ నుంచి 30వ తేదీవరకు మూడు రోజులు విస్తృత స్థాయి సమావేశం విశాఖ లో నిర్వాహిస్తున్నారు. ఈ మూడు రోజులు పాటు సేనతో సేనాని పేరిట జరిగే కార్యక్రమంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పాల్గొననున్నారు. 28వ తేదీన జనసేన లెజిస్టేటివ్ పార్టీ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో జనసేన ఎమ్మెల్యేల నుంచి పవన్ కల్యాణ్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటారు. పార్టీ క్షేత్రస్థాయిలో ఎలా ఉంది? కూటమి పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపై ఎమ్మెల్యే అభిప్రాయాలను తెలుసుకుంటారు.టీడీపీ ప్రతి ఏటా నిర్వహించిన మహానాడు తరహాలో ఈ సమావేశాలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. అలాగే జనసేన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో అధికారులు తమ మాట వినడం లేదని ఎప్పటి నుంచో ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారు. తాము ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ తమ మాట వినకుండా టీడీపీ ఇన్ ఛార్జుల మాటకే విలువ ఇస్తున్నారని, నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ జనసేనకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఇటీవల తరచూ ఎమ్మెల్యేలు చెబుతుండటంతో 28వ తేదీన జరిగే లెజిస్టేటివ్ సమావేశంలో దీనిపై కూలంకషంగా చర్చించే అవకాశముంది. ఎక్కడెక్కడ ఇబ్బందులున్నాయో తెలుసుకుని వాటిని టీడీపీ అధినేత చంద్రబాబు ముందు ఉంచే ప్రయత్నంలో భాగంగా ఈ సమావేశాన్ని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిసింది ఈతరం నేతలను గాడిన తేవడం కష్టమేనా? పార్లమెంటు నియోజకవర్గాల వారీగా... 28వ తేదీ మధ్యాహ్నం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుంది. ఆగస్ట్ 29వ తేదీన ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు పార్లిమెంట్ నియోజక వర్గాల వారిగా పదిమంది పార్టీ నేతలతో చర్చిస్తారు. అనంతరం పర్యావరణం , మహిళా బాధ్యత పై రక్షిత మంచినీటి పథకం, ఉపాధి క్షల్పన,మీద చర్చలు ఉంటాయి. కొత్త నాయకత్వం బయటకు వచ్చేలా ప్రోత్సహించేందుకే ఈ రకమైన సమావేశాలు అని జనసేన చెబుతుంది. విపక్షం సోషల్ మీడియా వినియోగించి చేసిన దుష్ప్రచారంపై కూడా చర్చిస్తారు. ఏడాది నుంచి అందించిన సుపరిపాలన మీద చర్చ జరుగుతుంది. ఎన్నికలు గడిచి పధ్నాలుగు నెలలు కావడంతో ఇప్పటి వరకు పార్టీ శ్రేణులతో గడిపే సమయం లేకపోవడం తో ఇప్పుడు ఈ కార్యక్రమంతో పార్టీ నాయకులు, కార్య కర్తలతో పవన్ కళ్యాణ్ కలిసి ఉంటారు. ఈ నెల 30 వ తేదీ జనసేన మహా సభ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సభ ప్రారంభమవుతుంది. సాయంత్రం 6 గంటలకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రసంగం ఉంటుంది.ఇప్పటికే సేనతో సేనాని కార్యక్రమ పోస్టర్ ను మంత్రి నాదెండ్ల మనోహర్ విడుదల చేశారు. పార్టీ విస్తృత స్థాయి సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్లను నాదెండ్ల పరిశీలించారు. క్యాడర్ లో ఉన్న అసంతృప్తిని పోగొట్టడానికి, కొత్త నాయకత్వాన్ని ఆహ్వానించడానికి, పార్టీలో, ప్రభుత్వంలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని జనసేన నేతలు చెబుతున్నారు. పవన్ కల్యాణ్ స్వయంగా హాజరయి క్యాడర్, ఇబ్బందులను విని వాటిని తొలగించే ప్రయత్నం చేస్తారని నమ్ముతున్నారు.

## డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ అధ్వర్యంలో ముందస్తు వినాయక చవితి వేడుకలు



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**
డాక్టర్ వైయస్సార్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ విధానంలో వినాయక చవితిని జరుపుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. అన్నపూర్ణ శారద విద్యార్థులకు మరియు కళాశాల అధ్యాపకులకు పిలుపునిచ్చారు. మట్టితో తయారుచేసిన విగ్రహాలను పూజా విధానాలకు ఉపయోగించాలని పర్యావరణ పరిరక్షణ చేపట్టాలని ఈ విధంగా విద్యార్థులందరూ వారి వారి గ్రామాల్లో మట్టి విగ్రహాలకు ప్రాముఖ్యత నివ్వాలని వివరించారు. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ సి. మంగల్ గౌరీ, ఐక్యుఎసి కోఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొనడం జరిగినది.

## దోమలలార్వాల నియంత్రణకు గంబూసియా చేప పిల్లలు నగరంలోని చెరువుల్లో వదిలిన అధికారులు




**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**
సీజనల్ వ్యాధులను నియంత్రణ, నిల్వ నీటిలో దోమల లార్వాల నియంత్రణకు కంబూసియా చేపపిల్లలను వదిలారు. మంగళవారం నగరపాలక పరిధిలో గంగి నేని చెరువు వద్ద ఏర్పాటు చేసిన కార్య క్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సుధారాణి, కమిషనర్ పి నరసింహ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి వేణు గోపాల్,ఎంహెచ్వో డా.లోకేష్ లు గంబూసియా చేప పిల్లలను నిల్వ నీటిలో వది లారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ.. నగరపాలక పరిధిలో దోమల జనాభా నియంత్రణలో భాగంగా చెరువు లు, నిల్వనీటి ప్రాంతాల్లో గంబూసియా చేప పిల్లలను వదిలినట్లు చెప్పారు. ఈ చేపలు నీటిలోని దోమల లార్వాలను మాత్రమే తిని జీవిస్తాయన్నారు. దోమల లార్వాలను గణనీయంగా నాశనం చేయడం ద్వారా దోమల జనాభాను నియంత్రిం చవచ్చని వివరించారు. మంగళవారం నగరపాలక పరిధిలోని గంగినేని చెరువు, కట్టమంచి చెరువు, బండపల్లి చెరువు, దుర్గా నగర్ కాలనీ, కొంగారెడ్డిపల్లి, వైఎస్ ఆర్ నగర్,రోసీనగర్, ప్రశాంత్ నగర్ తది తర ప్రాంతాల్లో సుమారు ఒక లక్ష గంబూ సియా చేపపిల్లలను వదిలినట్లుచెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు కార్యదర్శులు పాల్గొన్నారు.

## హంద్రీనీవ పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**
కుప్పం మున్సిపాలిటీ 8వ వార్డ్ లోగల పరమ సముద్రం నందు ముఖ్యమంత్రి పర్యటన కోసం హంద్రీనీవ పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ పపరమసముద్రం చెరువు వద్ద ముఖ్యమంత్రి పర్యటన కోసం జరుగు తున్న ఏర్పాట్లను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. హంద్రీనీవా కాలువ హంద్రీనీవ అధికారులు, కుప్పం మునిసిపల్ కమిషనర్, శ్రీనివాసరావు, పోలీసు శాఖ డి.ఎస్.పి భారత సారధి సిఐ శంకరయ్య, నాయకులు టీటీడీ బోర్డు మెంబర్ శాంతారాం రేస్కో చైర్మన్ విజీ ప్రతాప్, పట్టణ అధ్యక్షుడు రాజకుమార్, జనసేన కన్వీనర్ నరేష్ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కాణిపాకం వెంకటేష్, డైరెక్టర్ ఆర్ముగం తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## మానుష రూపంలో మన గణపయ్య



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**
కుప్పం పబ్లిక్ స్కూల్ ఆవరణలో మంగళవారం వినాయక చవితి ఉత్సవాన్ని, అంబరాన్ని తాకే సంబరాలతో జరుపుకున్నారు. విద్యార్థులు గణపతి ఆకారంలో కూర్చుని ఆ భక్త వత్సలున్ని ఆవిష్కరింపచేశారు. విద్యార్థులతో గణపతి వేషధారణ ఆహుతులను విశేషంగా ఆకర్షించింది. గణపతి పాటలతో విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్ పర్సన్ ఎన్. శాంతా నాగరాజు, ప్రధానోపాధ్యాయిని వి. దమయంతి, ఉప ప్రధానోపాధ్యాయిని బి. ప్రియ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేశారు. చైర్ పర్సన్ శాంతా మాట్లాడుతూ మన ఆచార సాంప్రదాయాలను విద్యార్థులందరికీ తెలుపుతున్నందుకు ఉపాధ్యాయులను అభినందించారు.

## కోలా ఆనంద్‌కు సన్మానం చేసిన వారి మిత్రబృందం



శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:
శ్రీకాళహస్తి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా వారి మిత్రబృందం నవయుగ విల్ నారాయణ, పసల రవి వారి బృందం కోలా ఆనంద్ ఘన సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మా మిత్రులు, శ్రీకాళహస్తి వాసి కోలా ఆనంద్ బిజెపి రాష్ట్రఉపాధ్యక్షులు పదవి రావడం ఎంతో సంతోషంగా గర్వంగా ఉందని తెలియజేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అధి రోహించాలని కోరుకున్నారు.

## ప్రవక్త ముహమ్మద్ స.అ.వ జెండా ఆవిష్కరించిన పీఠాధిపతి ఖ్వాజా జుబేర్ హయాత్ ఖాదరీ

### మిరియాల బాబా గౌసియా ఆశ్రమంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్ ,ఆగస్టు 26 :**
ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మదిన మాసం రబ్బిఉల్ అవ్వల్ ప్రారంభం అయిన శుభ సందర్భంలో మిరియాల బాబా గౌసియా ఆశ్రమ పీఠాధిపతి, ఆంధ్ర ప్రదేశ్ మాషాయక్ అసోసియేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి ఖ్వాజా జుబేర్ హయాత్ ఖాదరీ జెండా ప్రతిష్టణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా పీఠాధిపతి ఖ్వాజా జుబేర్ హయాత్ ఖాదరి విచ్చేసిన భక్తుల చేత పవిత్ర ఖురాన్ పఠనాన్ని పూర్తి చేసి ఫాతెహా నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తుల సమక్షంలో ప్రవక్త మొహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి పేరిట పవిత్ర జండాను భక్తి శ్రద్ధలతో ఆవిష్కరించారు. వందమందికి పైగా విచ్చేసిన భక్తులకు అన్నదానాన్ని నిర్వహించారు. పీఠాధిపతి ఖ్వాజా జుబేర్ హయాత్ ఖాదరి మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మదిన మాస ఆగమన శుభ సందర్భంగా పురస్కరించుకొని సంతోష పర్వాన్ని మిరియాల బాబా గౌసియా ఆశ్రమంలో ఆనవాయితీగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ శుభ సందర్భంలో కోరుకున్న కోరికలు సిద్ధించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ మషాయక్ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు రెహమాన్ షరీఫ్, సత్తార్ ఖాదరి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ మషాయక్ అసోసియేషన్ రేణిగుంట మండల కార్యదర్శి రైటర్ మహబూబ్ బాషా, బాలాజీ, నందా శెట్టి, తిరుపతి రవి, పవిత్ర మహిళా భక్తులు, ఆశ్రమ శిష్య బృందం పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26 :**
రేణిగుంట గ్రామపంచాయతీ భగత్ సింగ్ కాలనీ సత్యమ్మ గుడి వద్ద వినాయకుని మట్టి ప్రతిమలను రష్ హాస్పిటల్ అధినేత ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ముందుగా అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. గత పది సంవత్సరములుగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తూ ఈ ఏడాది కూడా మట్టి విగ్రహాలను ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. మట్టి వినాయకుని పూజించండి పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు భావితరాల భవిష్యత్తును కాపాడండి అని తెలియజేశారు నా వంతుగా ఈ మట్టి విగ్రహాలను ఇవ్వడం నా పూర్వజన్మ సుకృతం అన్నారు. అంతే కాకుండా ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలన్నారు.అందరూ కూడా సంతోషంగా వినాయక చవితి పండుగ చేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్,నగేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమ పాలన సాధ్యం



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26 :**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమ పాలన సాధ్యమని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిన్న తోటి నాగరాజు స్పష్టం చేశారు. మండలంలోని గాజులమండ్యం హరిజనవాడ నందు జనసేన పార్టీ మండలాధ్యక్షుడు చిన్నతోటి నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం అర్హులైన వారి ఇంటింటికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులను వీఆర్వో విశ్వనాథ్‌తో పాటు కలిసి అందచేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిన్న తోటి నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందన్నారు. ప్రజల సంక్షేమం కోసం కృషి సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేస్తున్నారని కొనియాడారు. గత ఐదేళ్లలో నకిలీ రేషన్ కార్డులు పుట్టుకొచ్చాయని ఆరోపించారు. నకిలీ కార్డులు ఏరీ వేయడానికి కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందన్నారు. అర్హులైన వారే ప్రభుత్వం అందించే రేషన్ తీసుకోవాలని ఉద్దేశంతోనే స్మార్ట్ రేషన్ కార్డులకు శ్రీకారం చుట్టారన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని కట్టుబడి ప్రజాభివృద్ధి ధ్యేయంగా పాలన సాగిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎన్నికల వాగ్దానాలను దాదాపు నెరవేర్చారని ఆనందం వ్యక్తం చేశారు.

## ఎరువులు, పురుగుమందుల షాపులను ఆకస్మికంగా తనిఖీ



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**
శ్రీకాళహస్తిజిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు, మండల వ్యవసాయ అధికారి మమతా రెడ్డి, శ్రీకాళహస్తి టూటౌన్ సిఐ నాగార్జున రెడ్డి మంగళవారం ఎరువులు, పురుగుమందుల షాపులను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. రాష్ట్రంలో యూరియా కొరతను దృష్టిలో ఉంచుకొని ఈ తనిఖీలు నిర్వహించి ఎరువుల చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై తగు కఠినమైన చర్యలు తీసుకోడం జరుగుతుందని హెచ్చరించడం జరిగింది.

## వీ.కోటలో మిన్నంటిన వినాయక చవితి వ్యాపారాలు.



**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్ ,ఆగస్టు 26:**
వినాయక చవితి సందర్భంగా వీకోట పట్టణం వ్యాపారస్తులతో కిటకిటలాడింది. ఎటు చూసినా వినాయక విగ్రహాలు అమ్మకాలు, పూలు అమ్మకాలు, అనేక రకాల పలహారాలు అమ్మకాలు విపరీతంగా జోరందుకున్నాయి. ఈ సందర్భంగా వీకోటలో వ్యాపారాలు, వాహనాల రద్దీతో ఒక నగరముల తలపించింది.

## మాట ప్రకారం మెగా డీఎస్సి నిర్వహణ

### నిరుద్యోగులకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం
### సంస్కరణల అమలు...బడులకు నూతన వెలుగులు
### ఏడాదికో డిఎస్సీ పేరిట దగా చేసిన జగన్ రెడ్డి
### మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అమర్



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**
యువతకు ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించామని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక ప్రతి ఏటా మెగా డీఎస్సీని నిర్వహించి యువ ఉపాధ్యాయులతో విద్యారంగాన్ని దేశంలోనే తొలి స్థానంలో నిలబెడతామని అన్నారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ,ఈడబ్ల్యూఎస్ మరియు దివ్యాంగ అభ్యర్థులకు వయసు మినహాయింపు ఇచ్చి వారికి అండగా నిలబడ్డామన్నారు. యువత బాగుపడటం ఇష్టం లేని జగన్మోహన్ రెడ్డి మెగా డీఎస్సీని ఆపడానికి 24 కేసులు వేయించారని వాటన్నిటిని అధిగమించి మెగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసిన ఘనత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ విద్యలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు గత 14 నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేస్తూ బడులకు నూతన వెలుగులు తెస్తున్నారని నారా లోకేష్ ను కొనియాడారు. చంద్రబాబు తన 14 ఏళ్ల ముఖ్యమంత్రి హోదాలో దాదాపు 13 డీఎస్సీలు నిర్వహించి లక్ష ఎనభై వేలకుకు పైగా పోస్టులు భర్తీ చేసి చరిత్ర సృష్టించారని, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులలో అధిక శాతం ఆయన హయాంలో ఉద్యోగాలు పొందిన వారేనన్నారు. అయితే 2019 ఎన్నికలకు ముందు మెగా డీఎస్సీ ఇస్తానని మాట ఇచ్చిన జగన్ రెడ్డి గత ఎన్నికలకు రెండు నెలల ముందు డీఎస్సీ విడుదల చేసి నిరుద్యోగులను మోసం చేశాడన్నారు. ఇక ప్రతి ఏడాది డీఎస్సీ అని అధికారం చేతుల్లో ఉన్నప్పుడు ఒక డీఎస్సీ కూడా ప్రకటించకుండా మెగా,,జంబో,మినీ డీఎస్సీ అని కాలం గడిపేసి నిరుద్యోగులను జగన్ దగా చేశారని విమర్శించారు.

## అక్రమంగా మట్టి తమిళనాడుకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.. తాసిల్దార్ లోకనాథ పిల్లై

**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**



అక్రమంగా మట్టిని తమిళనాడుకు తరలిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఆర్ పురం తాసిల్దార్ లోకనాథపిల్లై అన్నారు. మంగళవారం ఎస్ఆర్ పురం మండలం52 కనీకాపురం కమ్మరాయ గుట్టలో హిటాచి టిప్పర్ల ద్వారా అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పరిశీలించడం జరిగింది చిత్తూరు తర్చూరు జాతీయ రహదారి పనుల కోసం మట్టిని తరలిస్తున్నారని అక్కడ కెసిసి కాంట్రాక్టర్ తెలిపారు. దీనితో అనుమతి పత్రాలు చూపించేంతవరకు తాత్కాలికంగా పనులను ఆపివేయాలని తెలియజేసి పనులను నిలిపివేశారు దీనిపై ఎమ్మార్వో ను వివరణ కోరగా గతంలో మైనింగ్ డిపార్ట్మెంట్ ద్వారా జాతీయ రహదారి పనులకు మట్టి అవసరమని మాకు పర్మిషన్ కావాలని1 లక్ష 50 వేల క్యూబిక్ మీటర్ కావాలని దరఖాస్తు చేసుకున్నారు తరువాత పర్మిషన్ 30 వేల క్యూబిక్ వరకు పర్మిషన్ ఇస్తే చాలని అనడంతో మైనింగ్ డిపార్ట్మెంట్ వారు తాత్కాలిక పర్మిషన్ ఇవ్వడం జరిగింది. కానీ దీనిపై స్పష్టమైన వివరాల కొరకు మైనింగ్ డిపార్ట్మెంట్ వారు అనుమతి పత్రాలను అడిగి ఉన్నాము అది వచ్చిన వెంటనే పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటే వాళ్ల పనులు వాళ్ళు చేసుకోవచ్చు లేదంటే వాటిపైన చర్యలు తీసుకుంటామని తెలిపారు అనవసరంగా తమిళనాడుకు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. అని తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటా మని తాసిల్దార్ తెలియజేశారు.

## మట్టి వినాయక ప్రతిమలను పూజించండి పర్యావరణాన్ని కాపాడండి

### మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేసిన శ్రీధర్ యాదవ్



**ఎస్సార్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**
మట్టి వినాయక ప్రతిమలను పూజించండి పర్యావరణాన్ని పరిరక్షించండి అని టిడిపి జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ అన్నారు. మంగళవారం చిత్తూర్ నగర పట్టణం కొండారెడ్డిపల్లి లో వినాయక చవితి పండుగ వస్తున్న నేపథ్యంలో ఇంటింటికి వెళ్లి 200 చిన్న మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మట్టి విగ్రహాలను పూజించడం వల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. నేడు అందరూ మట్టి వినాయక ప్రతిమలు కాకుండా పర్యావరణానికి నష్టం కలిగించే ప్రతి మనం పూజించడం సరికాదని ప్రతి ఒక్కరు మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని కోరారు.

## మట్టి వినాయకుడిని పూజించి సంబరాలు




**శాంతిపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**
పర్యావరణానికి మేలు చేసే మట్టి వినాయకుడిని వినాయక చవితి సందర్భంగా పూజించాలని శాంతిపురం గడ్డురు ఏడిఫై ఇంగ్లీష్ మీడియం స్కూల్ మేనేజ్మెంట్ సూచించారు. ఎడిఫై ఇంగ్లీష్ మీడియం స్కూల్ మట్టి వినాయకుడి యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే అవగాహన కార్యక్రమాన్ని స్కూల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ యాజమాన్యం మాట్లాడుతూ ప్లాస్టిక్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసే వినాయకుడి విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడే అవకాశం ఉందని తెలియజేశారు. కుప్పం మహిళా అధ్యక్షురాలు అనసూయ మాట్లాడుతూ ప్లాస్టిక్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నీళ్లలో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై చర్మవ్యాధులు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా మట్టి వినాయకులను విద్యార్థుల చేత తయారు చేయించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్మెంట్ సి. శ్రీనివాసులు, డి ఈశ్వర ఆచారి, ఉపాధ్యాయులు బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల ఉద్యమం బలోపేతం చేద్దాం

### ఈనెల 31న మదనపల్లెలో జరిగే సదస్సుకు విచ్చేయండి

### వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ పిలుపు



**మదనపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**
దేశంలోని మెజారిటీ ప్రజలు లబ్ధిపొందు తున్న రిజర్వేషన్లకు, ప్రైవేట్ రంగం మంగళం పాడు తున్న నేపథ్యంలో, ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్ల అమలు కోసం ఉద్యమం బలోపేతం చెయ్యాల్సిన సమయం ఆసన్నమైందని విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకే పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం శివప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానికంగా గల ఒక ప్రైవేట్ అతిధిగృహంలో జరిగిన వీసీకే, బాస్ ముఖ్య ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ 2012లో ఎన్.ఆర్. మీనన్ కమిషన్ ప్రైవేట్ రంగం రిజర్వేషన్ల అమలుకు సిపార్సు చేసి, డ్రాఫ్ట్ బిల్లు కూడా రూపొందించడం జరిగిందని, దీన్ని వెంటనే పార్లమెంటులో అమోధించి, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలుకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మరియు ఈడబ్ల్యూఎస్ వర్గాకు, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల ఆవశ్య కతను తెలియజేసి, బలమైన ఉద్యమం నిర్మించేందుకు వీసీకే పార్టీ శ్రీకారం చుట్టిందని, ఇందు లో భాగంగా ఈనెల 31వ తారీఖు ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్ నందు అవగాహనా సదస్సు నిర్వహించి, కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఈసదస్సుకు అన్నమ య్య, చిత్తూరు జిల్లాల్లోని వీసీకే, బాస్ రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీల నాయకులందరూ హాజరు కావా లని శివప్రసాద్ కోరారు. ఈ సమావేశంలో వీసీకే, బాస్ నాయకులు ముత్యాల మోహన్, నీరుగ ట్టి రమణ, చాట్ల బయన్న, పెద్దపాలెం రవిశంకర్, తెట్టు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమర్జనం ఏర్పాట్లపై పరిశీలించిన సీఐ జయచంద్ర




**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26 :**
రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర ఎంపీడీవో ప్రభురావుతో కలిసి మండల పరిధిలోని వెంకటా పురం కరకంబాడి చెరువులను సందర్శించారు. వినాయక నిమర్జనం ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు భద్రతా చర్యలు శుభ్రత, విద్యుత్తు లైటింగు, త్రాగు నీరు సౌకర్యాలను సమీక్షిం చారు. భక్తులు నిమజ్జనం జరిపేందుకు అన్ని చర్యలు చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో పోలీసులు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## స్కూల్‌లో ఘనంగా ముందస్తు వినాయక చవితి సంబరాలు

**బుచ్చినాయుడు కండ్రిగ, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**





బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో కరెస్పాండెంట్ విద్యా ప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన ప్రిన్సిపాల్ మేరీ ఆధ్వర్యంలో ముందస్తుగా వినాయక చవితి సంబరాలును ఘనంగా జరుపు కున్నారు. విద్యార్థిని, విద్యార్థులుభక్తి శ్రద్ధలతోవినాయకుని పూజమ హెూత్స వములో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో కరెస్పాండెంట్ మాట్లాడుతూ, వినాయక చవితి సందర్భంగా ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, విఘ్నా లు తొలగిపోవాలని విజయాలు సిద్ధిం చాలని ఆకాంక్షించడం పరిపాటిగా ఉందని, వినాయక చవితి రోజున ప్రత్యేక పూజలు, నైవేద్యాలు, గణపతి కథ చదివే సంప్రదాయం ఉందని అందులో భాగంగానే విద్యార్థులకు గణపతి కథను చెప్పడం జరిగిందని తెలిపారు. విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మూడు రోజులు గణపతి పూజలు అందుకోనున్నారని, మూడవ రోజు నిమ్మర్జన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## తాసిల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశం



**వెదురు కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**
వెదురు కుప్పం మండలం మంగళవారం రోజు తాసిల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తాసిల్దార్ బాబు మాట్లాడుతూ ఒకటవ తేదీ నుంచి పాత రేషన్ కార్డులు తొలగించి కొత్త స్మార్ట్ కార్డులు ఇవ్వడం జరుగుతుంది అని తెలియజేశారు. అదే విధంగా డీలర్లకు ప్రతి షాపు దగ్గర ఒక రెవెన్యూ సిబ్బందిని పెడుతున్నట్లు తెలియజేశారు.

## మట్టి విగ్రహాన్ని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**
అన్నమయ్యజిల్లా పీలేరు వినాయక చవితి పర్వదినం సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగ స్వామ్యం కావాలని సాయిబాబా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శు లు ఎన్ వీరయ్య జి ప్రభాకర్ రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించు కుని 2000 మట్టి విగ్రహాలను ప్రజలకు వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కోటపల్లి బాబు రెడ్డి మాట్లాడుతూ విగ్రహాల తయారీలో వినియోగించే రకరకాల రసాయనిక పదార్థాలతో వాతావరణం కాలుష్యం అవుతుం దన్నారు.నీటిలో కరగని ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, పిఓపి దానికి వినియోగించే రంగులతో పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పురం రామ మూర్తి, ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర, శ్రీ అంకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ రామకృ ష్ణారెడ్డి, ప్రముఖ నేత పోలిశెట్టి సురేంద్ర, రెడ్డి ముని, వసంతల రాజా సాయిబాబా సంఘం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళుతున్న సచివాలయం సిబ్బందికి వీడ్కోలు



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**
వెదురుకుప్పం మండలం కొమరగుంట సచివాలయం పరిధిలో ఇనాంకొత్తూరు పంచాయతీ భవనంలో ఇటీవల బదిలీ పై వెళ్లిన సచివాలయం సిబ్బందికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి చిరు కానుకలు అందించిన సర్పంచులు కటారి మమత, ద్రాక్షయని, ఎంపిటిసి సభ్యులు మునిచంద్రా రెడ్డి, టిడిపి నాయకులు కటారి మోహన్ రెడ్డి, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఓ పురుషోత్తం పాల్గొన్నారు.

## ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన వైసిపి నాయకులు



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**
అన్నమయ్యజిల్లా పీలేరు వైసిపి నాయకులు విజయవాడలో ఏసీబీ కోర్ట్ వద్ద పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ని కలిశారు. ఈ సందర్భంగా మిథున్ రెడ్డి ప్రతి ఒక్కరిని పేరుపేరునా పలకరించారు. ఈ కార్యక్రమంలో పీలేరు మండల వైస్సార్సీపీ శ్రేణులు చక్రధర్, కంభం శ్యామ్సుందర్ రెడ్డి, ఉదయ, పెద్దిరెడ్డి ద్వారక నాథ రెడ్డి, లోకనాథ రెడ్డి,మూరే భువనేశ్వర రెడ్డి,అమరనాథ రెడ్డి, రవి, లోకనాథం తదితరులు. పాల్గొన్నారు.

## గిరి బలిజ జీవో రద్దు చేయాలి

### జాతీయ కాపు సంఘం ప్రధాన కార్యదర్శి గోపి రాయల్

**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 26:**



గిరి బలిజ జీవోను వెంటనే రద్దు చేయాలని జాతీయ కాపు సంఘం ప్రధాన కార్యదర్శి గోపి రాయల్ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు విజయబాబు అన్నా రు. ఈ సందర్భంగా ఎస్ఆర్ పురం తాసిల్దార్‌కి గిరి బలిజ జీ వో నెంబర్ 179 రద్దు పరచా లని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గోపి రాయల్ మాట్లాడుతూ దొమ్మర కుల స్తుల్ని బలిజ కులస్తులగా రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. దొమ్మర కులం అభివృద్ధికి కాపు కులం అడ్డురాదు అని తమ హక్కుల కోసమే పోరాడుతున్నా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య రమణ రాయల్ భాస్కర్ గోపి సుబ్బానాయుడు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ప్రపంచ రికార్డుల ప్రస్థానానికి ఆరంభం

1955 ఆగస్టు 27న బ్రిటన్‌లో వెలువడిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ తొలి సంచిక, మానవ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం రాసింది. ఇప్పటి వరకు వ్యక్తుల వ్యక్తిగత కీర్తి, దేశాల ప్రత్యేకతలు, ప్రకృతి అద్భుతాలు విడివిడిగా పత్రికల్లో, పుస్తకాలలో నమోదు అయ్యేవి. కానీ వాటిని ఒకే చోట సమీకరించి, శాస్త్రీయంగా వర్గీకరించి, ప్రజలకు సులభంగా అందించే ప్రయత్నం ఇదే తొలిసారి. ఆ తొలి సంచికతోనే ఈ పుస్తకం ప్రపంచ వ్యాప్తంగా అపూర్వ ఆదరణ పొందింది. కాలక్రమేణా ఇది కేవలం ఒక పుస్తకమే కాకుండా, మానవ ప్రతిభ, కృషి, కల్పన, విచిత్రతలకు ప్రతిబింబంగా మారిన వేదికగా నిలిచింది. ఈ ఆలోచనకు బీజం 1951లో ఐర్లాండ్‌లో వేసిన ఒక వేట సంఘటన లో పడింది. గిన్నిస్ బ్రూవరీస్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ హ్యూ బీవర్, తన మిత్రులతో కలిసి వేటలో పాల్గొన్నప్పుడు "యూరప్‌లో అత్యంత వేగంగా ఎగిరే పక్షి ఏది?" అన్న ప్రశ్నపై వాదన ప్రారంభమైంది. వారు అందుబాటులో ఉన్న పుస్తకాలు తిరగేసినా తగిన ఆధారాలతో కూడిన సమాధానం దొరకలేదు. ఈ సంఘటన బీవర్ మదిలో ఒక వినూత్న ఆలోచనకు దారితీసింది. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి ప్రశ్నలకు, వాదనలకు ముగింపు పలికి, సమగ్ర సమాచారం అందించే ఒక గ్రంథం అవసరమని ఆయన గ్రహించారు. తన ఆలోచనను ఆచరణలోకి తీసుకు వెళ్లేందుకు బీవర్ లండన్‌లో గణాంక సేకరణలో ఖ్యాతి పొందిన కవల సోదరులు నోరిస్ మెక్‌విర్టర్, రాస్ మెక్‌విర్టర్‌లను సంప్రదించాడు. వీరు అప్పటికి ఫాక్ట్ ఫైండర్స్ ఏజెన్సీ పేరిట సమాచార సేకరణ సంస్థను నడుపు తున్నారు. గిన్నిస్ సంస్థ ఆర్థిక సహకారంతో ఈ సోదరులు విస్తృతంగా పరిశోధనలు చేసి, వివిధ రంగాల నుంచి రికార్డులను సేకరించారు. క్రీడలు, ప్రకృతి, శాస్త్రం, సాంకేతికం, మానవ ప్రతిభ, కళలు, వినోదం వంటి విభిన్న విభాగాల్లోని విశేషాలను గణాంకాలతో సమీకరించి, పుస్తక రూపంలో కూర్చారు. అనేక నెలల శ్రమతో సిద్ధమైన ఈ గ్రంథం 1955 ఆగస్టు 27న లండన్ ఫ్లీట్ స్ట్రీట్‌లో విడుదలైంది. 197 పేజీలతో వెలువడిన ఆ తొలి సంచిక అద్భుతమైన విజయాన్ని సాధించింది. విడుదలైన మొదటి రోజే అది ప్రజల దృష్టిని ఆకర్షించింది. నాలుగు నెలల వ్యవధిలోనే అది బ్రిటన్‌లో అత్యధికంగా అమ్ముడైన నాన్-ఫిక్షన్ పుస్తకంగా నిలిచింది. ఆ సంవత్సరం క్రిస్మస్ సీజన్ నాటికి దాదాపు ప్రతి ఇంటికి చేరేంతగా అది ప్రాచుర్యం పొందింది. ఆ తొలి సంచికలోనే అనేక ఆసక్తికరమైన రికార్డులు చోటు చేసుకున్నాయి. అమెరికాకు చెందిన రాబర్ట్ వాడ్లో 8 అడుగులు 11 అంగుళాల ఎత్తుతో అత్యంత పొడవైన మనిషిగా గుర్తింపు పొందాడు. భారత దేశానికి చెందిన గుల్మ్ మహమ్మద్ కేవలం 57 సెంటీమీటర్ల ఎత్తుతో అత్యంత చిన్న మనిషిగా నమోదు అయ్యాడు. బ్రిటన్‌లో నడిచిన "మల్లార్డ్" స్టీమ్ లోకోమోటివ్ గంటకు 126 మైళ్ళ వేగంతో ప్రపంచం లోనే వేగవంతమైన రైలు కీర్తి సాధించింది. కాలిఫోర్నియా లోని బ్రిసిల్ కోన్ పైన్ సుమారు 4,000 ఏళ్ల వయసుతో అత్యంత పాత వృక్షంగా నిలిచింది. ప్రపంచం లోనే ఎత్తైన భవనం న్యూయార్క్ లోని "ఎంపైర్ స్టేట్ బిల్డింగ్"గా పేర్కొనబడింది. ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా ముద్రించ బడిన పుస్తకంగా బైబిల్ నమోదు అయింది. ఇవన్నీ పాఠకులను ఆకర్షించడమే కాకుండా, భవిష్యత్తు సంచికల పునాది వేయించాయి. ఈ పుస్తకం వెలువడిన రెండవ సంవత్సరానికే, 1956లో అమెరికాలో ప్రత్యేక సంచిక విడుదలైంది. తర్వాత ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లోనూ అనువాదాలు వచ్చాయి. కేవలం పది సంవత్సరాల్లోనే 3.5 మిలియన్ కాపీలు అమ్ముడై, ఒక అద్భుత ప్రచురణా చరిత్రను సృష్టించింది. 1960ల నాటికి ప్రతి సంవత్సరం కొత్త సంచిక వెలువడుతూ తాజా రికార్డులను సేకరించడం ప్రారంభమైంది. కాలక్రమేణా రికార్డులను సేకరించడం, ధృవీకరించడం శాస్త్రీయ ప్రమాణాలతో కూడిన కఠిన ప్రక్రియగా మారింది. ఈ గ్రంథం ప్రభావం విశేషం. మానవులలోని పోటీ భావన, కృషి, విశ్వాసం, ప్రతిభను వెలికి తీసింది. అనేక మంది వ్యక్తులు, సంస్థలు గిన్నిస్ రికార్డుల్లో చోటు సంపాదించాలనే తపనతో కొత్త రికార్డులు సృష్టించేందుకు ప్రేరణ పొందారు. ఈ ప్రస్థానం కేవలం రికార్డుల సేకరణకే పరిమితం కాకుండా, మానవ సృజనాత్మకతకు, ధైర్యానికి, పట్టుదలకు వేదికగా నిలిచింది. నేడు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ పేరుతో ఈ పుస్తకం 100కుపైగా దేశాల్లో, 20కుపైగా భాషల్లో ప్రచురించ బడుతోంది. ప్రతి సంవత్సరం కొత్త సంచిక వెలువడుతూ లక్షలాది కాపీలు అమ్ముడవుతున్నాయి. పుస్తకం మాత్రమే కాదు, టెలివిజన్ కార్యక్రమాలు, వెబ్‌సైట్లు, సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా విశేష ఆదరణ పొందుతోంది. 1951లో ఒక వేట ప్రయాణంలో పుట్టిన చిన్న ఆలోచన, 1955లో పుస్తక రూపంలో ఆవిష్కృతమై, నేడు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందిని ఆకర్షించే అంతర్జాతీయ వేదికగా మారింది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ పుస్తకం కేవలం గణాంకాల సంకలనం మాత్రమే కాదు, మానవ కల్పనాశక్తి, కృషి, ప్రతిభ, ధైర్యానికి ప్రతిబింబం. ఇది ప్రపంచ అద్భుతాలను ఒకే అద్దంలో చూపించే చరిత్రాత్మక గ్రంథంగా, నేటికీ అప్రతిహతమైన ఆదరణతో కొనసాగుతోంది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143